క్లుప్తంగా

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొవ్వూరు: రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో నష్టపోయిన మామిడి, జీడి మామిడి, కొబ్బరి, అరటి తదితర పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని పౌరహక్కుల సంఘం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు మెట్ట రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయని ఆయన అన్నారు. పంట చేతికి అందే దశలో నేలవాలడంతో రైతులకు తీవ్రంగా నష్టపోయారని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు మామిడి, జీడి మామిడి పంటపైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఎకరాకు రూ.50వేలు చొప్పున పరిహారం చెల్లించి బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

ఉమా చోడేశ్వరస్వామికి రుద్రాభిషేకం



కొవ్వూరులో ఉమాచోడేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలో పాతూరులోని ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అనంతరం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. పట్టణ వాస్తవ్యులు బాలప్రసాద్, జానకి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి బిల్వార్చన, అమ్మవారికి శ్రీ సూక్త విధానంలో కుంకుమ పూజ, రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

17న వాసవీ మాత జయంత్యుత్సవం

కొవ్వూరు: పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈనెల 7న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే వీరవెంకట వరప్రసాద్ తెలిపారు.అమ్మ వారికి సహస్రనామ కుంకుమార్చన, క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. కక్కిరాల శ్రీనివాసరావు, లక్ష్మీఅన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా గులాబీ అర్చన నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా దేవతామూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠ

నిడదవోలు రూరల్: నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో గణపతి, కోదండ రామస్వామి, సాయిబాబా విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం కాటకోటేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారం



బాలుడికి పటిక బెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: స్థానికంగా కొలువైన బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఓ బాలుడికి పటిక బెల్లంతో తులాభారం వేశారు. తాడేపల్లిగూడెం మండలం చిన్నతాడేపల్లి గ్రామానికి చెందిన పరిమి ప్రవీణ్, శార్వాణి దంపతుల కుమారుడు షణ్ముఖ సత్య కార్తికేయకు కుటుంబ సభ్యులు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ



హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న మహిళా భక్తులు

నిడదవోలు : పట్టణంలోని అన్నపూర్ణనగర్ శ్రీరామలయంలో శ్రీ రామా దూత హనుమాన్ చాలీసా పారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠనంతో శారీరక, మానసిక ధృఢత్వం కలుగుతుందని భక్తులు తెలిపారు. అనంతరం తమలపాకులు, సింధూరంతో స్వామివారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విస్సా ప్రగడ మోహన్ కృష్ణ, పసుపులేటి రామకృష్ణ, గమిని వెంకటరత్నం, కోడేటి సత్యవతి, నార్ల సత్యవతి, జాన్సీ, వలివేటి సుబ్బారావు, మాజేటి నర్సింహం, వేదుల జనార్ధన రావు పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. అపార నష్టం



వర్షానికి గౌరీపట్నం వద్ద తడిసిన ధాన్యం రాశిపై బరకం కప్పుతున్న రైతు



తడిసి ముద్దయిన పచ్చి ఇటుకలు

- తడిసిన ధాన్యం రాశులు
- ఈదురు గాలులకు విరిగిన అరటి తోటలు
- లక్షలాది పచ్చి ఇటుకలు వర్షార్పణం
- కుదేలైన ఇటుక పరిశ్రమ

పెరవలి: అకాల వర్షం వరి రైతుల నడ్డి విరిచింది. ధాన్యం కొనుగోలు జాప్యం కారణంగా ఇబ్బందులు ఉన్న రైతులను అకాల వర్షాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట నోటికి దక్కకుండా పోతుందనే భయంతో రైతులు అల్లాడిపోతున్నారు. ఎన్నో అగచాట్లు పడి వ్యయప్రయాసలకు ఓర్చి సాగుచేసి, కోత కోసి పంట ఒబ్బిడి చేసినా అకాల వర్షాలకు ధాన్యం తడవడంతో రంగుమారి, మొలక వస్తుందన్న భయంతో రైతులు విలవిల్లాడుతున్నారు. పెరవలి మండలంలో ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలను జలమయమయ్యాయి. దీంతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులు తడిచి ముద్దవ్వడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. తడిచిన ధాన్యం రాశులను, బస్తాల్లో పట్టిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఎండ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది దాళ్వా పంట ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడి రావడంతో రైతులు ఎంతో ఆశగా ఉన్న సమయంలో ఈ అకాల వర్షాలు రైతుల నడ్డి విరిచాయి. ధాన్యం తడవడం వలన సరైన గిట్టుబాటు ధర లభించదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దాళ్వా సాగుకి నీటి ఇబ్బంది ఎదురైనా బోర్లపై సాగు చేశామని పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు నిలువునా ముంచాయని రైతులు వాపోతున్నారు. ఏటా ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నామని అప్పులు తప్ప వ్యవసాయంలో ఏమీ మిగలడం లేదని రైతులు, కౌలుదారులు చెప్పారు.

విరిగిన అరటి చెట్లు

ఈదురు గాలులకు అరటి చెట్లు విరిపోయాయి. పెరవలి మండలంలో వరి తరువాత అత్యధికంగా అరటి పంటను సాగు చేస్తారు. గిట్టుబాటు ధర లేక అరటి రైతులు అల్లాడుతున్నారు. ఈ అకాల వర్షాలు, ఈదురు గాలులు రైతుల నడ్డి విరిచాయి.

యజమానులకు లక్షల్లో నష్టం.. పనుల్లేక కూలీల పస్తులు

పెరవలి: అకాల వర్షంతో ఇటుక పరిశ్రమ కుదేలైంది. ప్రకృతి కన్నెర్ర చేస్తే తమ బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయని ఇటుక తయారీదారులు గగ్గోలు పెడుతున్నారు. అకాల వర్షం కారణంగా ఆరబెట్టిన ఇటుకలు తడిసిపోవడంతో బట్టీ యజమానులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒక ఇటుక తయారీకి రెండున్నర రూపాయలు పెట్టుబడి అవుతుందని, ఆరబెట్టి కాల్చిన ఇటుకగా మార్చడానికి మరో రెండున్నర రూపాయల ఖర్చు అవుతుందని ఈ అకాల వర్షాలతో ఇటుకలు తడిచి ముద్దవ్వడంతో భారీగా నష్టపోయామని వారు వాపోతున్నారు. పది రోజుల్లో మూడు సార్లు అకాల వర్షాలు కురిశాయని, ఇప్పటి వరకు మండలంలోని బట్టీ యజమానులు రూ.40 లక్షల వరకూ ఆర్థికంగా నష్టపోయారు.

40 వేల మందికి ఇటుక పరిశ్రమే ఆధారం

జిల్లాలో ఇటుక బట్టీల పరిశ్రమలపై 4,500 కుటుంబాలు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మంది ఈ పరిశ్రమపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు.

ఈ ఏడాది అంతా నష్టాలే



10 రోజుల్లో మూడు సార్లు కురిసిన వర్షాల వలన లక్ష ఇటుకలు తడిసి పాడైపోయాయి. ఈ ఏడాది అంతా నష్టాల్లో ఉన్నాం. అకాల వర్షాలు మరింత కుంగదీశాయి. కూలీలకు పనులు లేవు. పెట్టుబడి నష్టం కారణంగా బట్టీ యజమానులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు.

– మోపిదేవి సోమేశ్వరరావు, ఇటుక బట్టీ యజమాని, మల్లేశ్వరం

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షాలు మా నడ్డి విరిచాయి. కళ్లాల్లో లక్ష వరకూ ఇటుక ఉంది. వర్షాల కారణంగా పచ్చి ఇటుక అంతా తడిసిపోయింది. కూలీలకు పనులు లేవు. నష్టపోయిన బట్టీ యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలి.

బిరుదుకోట పుల్లయ్య, ఇటుక బట్టీ యజమాని, మల్లేశ్వరం

రాత్రి వేళ వర్షాలతో భారీ నష్టం



ఊహించని విధంగా వర్షాలు రాత్రి సమయాల్లో వస్తున్నాయి. అప్పటికప్పుడు పచ్చి ఇటుకలను భద్ర పరచాలంటే చాలా కష్టం. అందువలనే భారీగా నష్టపోయాం. 10 రోజుల్లో కురిసిన వర్షాల వలన 1.20 లక్షల ఇటుకలు తడిసి పాడైపోయాయి.

– తమనంపూడి నారాయణరెడ్డి, ఇటుక బట్టీ యజమాని, కడింపాడు

పెరవలి మండలంలో 66 బట్టీలు ఉండగా ప్రతిరోజూ ఈ బట్టీల నుంచి 10 లక్షల ఇటుకలు సిద్ధం చేస్తారు. ఇందుకోసం శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, విశాఖపట్నం, పశ్చిమ, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచే కాకుండా బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి సుమారు 3వేల మంది కార్మికులు ఈ ఇటుక బట్టీల్లో వివిధ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. అకాల వర్షాల వలన పచ్చి ఇటుకంతా తడిసిపోవడంతో కూలీలకు పనిలేకుండా పోయింది. అప్పులు చేసి ఇటుక పరిశ్రమను కొనసాగిస్తుంటే ప్రకృతి కన్నెర్రతో నష్టపోవాల్సి వస్తోందని బట్టీల యజమానులు చెప్పారు. ఇప్పటికే ముడిసరుకుల ధరలు పెరిగి, ఇటుకకు గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్న బట్టీ యాజమానులను వేసవి వర్షాలు మరింత కష్టాల్లోకి నెట్టింది.

మెట్టలో కుండపోత



దేవరపల్లిలో కుండపోతగా కురుస్తున్న వాన

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో కుండపోత వర్షం కురిసింది. సుమారు రెండు గంటలు ఎడతెరిపి లేకుండా వాన దంచి కొట్టడంతో వర్షం నీరు రోడ్లపై ప్రవహించింది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు వర్షం కుండపోతగా కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో చల్లని గాలులకు ప్రజలు సేదతీరారు. వర్షం అనంతరం ఏర్పడిన చల్లని వాతావరణానికి ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉల్లాసంగా గడిపారు. ఉదయం 7 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన ఈదురుగాలులతో వర్షం ప్రారంభమైంది. వర్షానికి దేవరపల్లి మండలంలోని సూర్యనారాయణపురం, యర్నగూడెం, కృష్ణంపాలెం, దుద్దుకూరు, గౌరీపట్నం ప్రాంతాల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిచిముద్దయింది. బస్తాల్లో పట్టి మిల్లుకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం తడవడంతో రైతులు కలవరపడుతున్నారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పి భద్రపరచినప్పటికీ రాశుల అడుగు భాగం నుంచి నీరు ప్రవహించడంతో సగ భాగం ధాన్యం తడిచినట్టు రైతులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి గౌరీపట్నం, దుద్దుకూరు వద్ద ధాన్యం బస్తాల్లో పడుతుండగా అకాల వర్షం కురిసినట్టు రైతులు తెలిపారు. పట్టుబడి పట్టిన ధాన్యం రెండు గంటల్లో మిల్లుకు చేరేదని రైతులు వివరించారు. ఈ వారంలో రెండు సార్లు అకాల వర్షం కురవడంతో ధాన్యం తడిచి నష్టపోయినట్టు రైతులు వాపోతున్నారు. కళ్లాల్లోని మొక్కజొన్న తడిచింది. వరికోతలు నిలిచిపోయాయి. బాడవ భూముల్లో వేసిన పొగాకు తోటలకు నష్టం జరుగుతుందని రైతులు తెలిపారు. అయితే వాణిజ్య పంటలు కొబ్బరి, ఆయిల్‌పామ్, అరటి, కూరగాయల పంటలకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. యర్నగూడెంలోని ప్రభుత్వ బాలికల ప్రత్యేక వసతి గృహం రోడ్డు పూర్తిగా జలమయమైంది. దేవరపల్లిలో బస్టాండ్ సెంటర్లో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోయింది. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలవడంతో ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి, జీడిమామిడి తోటలకు పాక్షికంగా నష్టం జరిగినట్టు రైతులు తెలిపారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక దయనీయ పరిస్థితిలో ఉన్న ధాన్యం రైతులు అకాల వర్షాలకు ఆందోళన చెందుతున్నారు.

భారీ వర్షంతో రహదారులు జలమయం



బ్రాహ్మణగూడెంలో ప్రధాన రోడ్డుపై వర్షం నీరు



కొవ్వూరు ఫైర్‌స్టేషన్ వద్ద వర్షం నీరు

కొవ్వూరు: పట్టణంలో ఆదివారం ఉదయం వాన దంచికొట్టింది. సుమారు గంటన్నరకి పైగా వర్షం విడకుండా కురిసింది. దీంతో రోడ్లపై ఎక్కడికక్కడే నీళ్లు నిలిచిపోయాయి. వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగి పడ్డాయి. పట్టణ శివారున ఆంధ్ర కెమికల్స్ ఫ్యాక్టరీ సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాటన్ విగ్రహం వద్ద వై జంక్షన్ నుంచి వన్ వేలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. అకాల వర్షంతో రోడ్లపై . ధాన్యం ఆరబెట్టిన రైతులు తీవ్ర ఇబ్బందులను చవిచూశారు. హడావిడిగా ధాన్యం ఒబ్బిడి చేసుకున్నారు. ప్రభుత్వం సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ఈదురుగాలులు, వాన కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి పడడంతో పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు పూర్తి చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. ఐ.పంగిడి, వాడపల్లి, కాపవరం, దొమ్మేరు, ఆరికిరేవుల, ఔరంగబాద్‌ల్లో వాన దంచికొట్టింది. నియోజకవర్గం వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లోనూ అకాల వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది.రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వర్తకులు వర్షం కారణంగా ఇబ్బందులను చవి చూశారు.

దంచికొట్టిన వాన

తాళ్లపూడి: అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. వర్షం కురవడంతో ఎండల వేడి నుంచి నుంచి జనం ఉపశమనం పొందారు. ప్రస్తుతం మండలంలో రబీ వరి కోతలను రైతులు ముమ్మరంగా చేపట్టారు. యంత్రాలతో కోసిన ధాన్యం తడిసిపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. రోడ్ల పైకి తరలించిన ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్నారు. కొన్ని చోట్ల బస్తాల్లో పట్టిన ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు.

చాగల్లులో వర్షం

చాగల్లు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో ఉక్కపోతతో ఎండ వేడిమిని తట్టుకోలేకపోతున్న ప్రజలు వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. మండల కేంద్రమైన చాగల్లు తోపాటు బ్రాహ్మణగూడెం, ఎస్ ముప్పవరం, ఊనగట్ల, దారవరం తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చిక్కాల, కలవలపల్లి తదితర ప్రాంతాల్లో మామిడి కాయలు నేలరాయి. అరటి తోటలు నెలకొరిగాయి.

‘ఆఖరి ఫొటో’ కవితకు ఉత్తమ పురస్కారం



మండల ఏఎస్‌వో వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: సమాజంలో నిత్యం ఎదురయ్యే అనేక సంఘటనలు, సామాజిక అంశాలు, మనస్సును ఉల్లాస పరిచే వాతావరణం వంటి అనేక అంశాలను తన కలంతో కవితలుగా మారుస్తూ ఒక పక్క ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, మరో వైపు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఆయన రాసిన ×ఆఖరి ఫొటో౹ కవితకు ఉత్తమ బహుమతి లభించింది. ఆదివారం రాజమండ్రిలోని ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన సాహిత్య గోదావరి వార్షిక విభిన్న కవితల సంకలన పుస్తకావిష్కరణ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు ఇటీవల కశ్మీర్ ఘటనపై రాసిన ఆఖరి ఫొటో కవిత వారంతపు కవితల్లో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయనను శాలువ, జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో సాహితీ గోదారి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజా, ముష్టి కామేశ్వరరావు, దొర్బల ప్రభాకర శర్మ, మూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

శ్యామలాదేవికి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం

దేవరపల్లి: కృష్ణంపాలెంలోని అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జి.శ్యామలాదేవి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయవాడలోని హోటల్ ఐలాపురం వేదికగా నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో శ్యామలాదేవికి మాజీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందజేసి సత్కరించారు. పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి సామాజిక సేవా రంగంలో ప్రసిద్ధి చెందిన దాదాపు 30 మందికి డాక్టర్ ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందజేసినట్టు శ్యామలాదేవి తెలిపారు. మెమెంటో, శాలువా, సర్టిఫికెట్ అందజేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీకళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, టీడీపీ ఎంఆర్ఏ విభాగం కన్వీనర్ రాజశేఖర్, రాష్ట్ర ఆర్య వైశ్య సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాజేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమావతి, పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

నల్లజర్ల: పోతవరం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేసి, పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9 వేల నగదు, 15 కోడి కత్తులు, 15 బైక్‌లు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశారు. మండలం పరిధిలో జూదాలు, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. సారా తయారీ, విక్రయాలపై నిఘా ఉంచామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పోతవరంలో కలసిన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: వారంతా పాతికేళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని రోజంతా సందడి చేశారు. పోతవరం జెడ్పీ హైస్కూలులో 2000–2001 సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం పోతవరం ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇక్కడ ఆట పాటలతో సందడి చేశారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

పేదల ఫ్యాన్ కనుమరుగు

- విసన కర్రలకు తగ్గిన ఆదరణ
- గ్రామాల్లో కానరాని తయారీ
- ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిన తయారీదారులు



విసన కర్రలు తయారీ చేస్తున్న మహిళ శారద

నల్లజర్ల: వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించే విసనకర్రలకు రోజురోజుకూ ఆదరణ తగ్గుతోంది. వేసవిలో ప్రతి ఇంట్లో దర్శనమిచ్చే విసనకర్ర నేడు కనుమరుగవుతోంది. ఎలక్ట్రానిక్ ఉపకరణాల ప్రవేశంతో ఈ కుటీర పరిశ్రమకు గడ్డుకాలం దాపురించింది. విసనకర్రల విక్రయాలతో బతుకుతున్న కార్మికులు జీవనోపాధిలేక ఇబ్బందులు పడుతున్నారు.

పేదల ఫ్యాన్ విసన కర్ర

పేదల ఫ్యానుగా భావించే విసనకర్రల తయారీలో నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం వాసులకు పెద్ద పేరే ఉంది. ఒక సామాజిక వర్గానికి చెందిన పాతిక కుటుంబాల వారు విసెన కర్రలు తయారు చేసేవారు. ఉదయాన్నే మగవారు తాటిచెట్ల నుంచి లేత ఆకులను నరికి తీసుకువచ్చి ఎండబెడతారు. మధ్యాహ్నం నుంచి మహిళలు చాలా ఓర్పు, సహనంతో వాటిని కత్తిరించి విసన కర్రలుగా కుడతారు. ఇలా తయారు చేసిన వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. అప్పట్లో వంద విసన కర్రలు అమ్మితే రూ.5 వచ్చేవని ప్రస్తుతం ఒక్కో విసనకర్ర రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నట్టు ఆ గ్రామానకి చెందిన వృద్ధుడు గోగులమూడి వీరాచారి వివరించాడు. గడచిన 40 ఏళ్లుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నట్టు వివరించారు. కాలక్రమంలో వీటి ప్రాధాన్యత తగ్గడం తయారీ దార్లంతా ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో విసన కర్రలు తయారు చేసే రెండే కుటుంబాలు మిగిలాయి. తాటి చెట్లు అంతరించిపోవడంతో ఆకులు దొరకడం కష్టంగా ఉందని కాకర్ల మూడి కేశవరావు వివరించారు. దాదాపు 15, 20 కిలో మీటర్లు వెళితే తప్ప తాటి చెట్లు కనపడటం లేదని చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వీటికి గిరాకీ బాగా ఉంటుందని మిగతా రోజుల్లో కూలీ పనికి వెళతామని ఈ పనిలో ఆరితేరిన మహిళ శారద వివరించారు. రోజుకు 50కిపైగా విసెన కర్రలు తయారు చేస్తున్నట్టు చెప్పారు.

కష్టానికి తగ్గ ప్రతిఫలం లేదు



ఇంటిల్లిపాది కష్టపడి తయారు చేసిన విసనకర్రలకు ప్రజల్లో ఆదరణ తగ్గుతుంది. శ్రమకు తగ్గ ప్రతిఫలం లేదు. తర తరాలుగా మా కుటుంబాలు ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాం. ప్రస్తుతం తాడిచెట్లు తగ్గిపోవడంతో ఆకుల సేకరణ కష్టమవుతోంది. కుటీర పరిశ్రమలను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పడం మినహా ఆచరణలో కనపడటం లేదు. మమల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

గోగులమూడి వీరాచారి,తయారీ దారు,అచ్చన్నపాలెం